సాక్షి తిరుపతి

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



పంటలపై గజరాజుల బీభత్సం

చంద్రగిరి నియోజకవర్గం, చిన్నగొట్టిగల్లు మండలంలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. - 8లో



వర్షం..రోగులకు నరకం

తిరుపతి రుయా ఆస్పత్రిలో రోగులు నరకయాతన పడ్డారు. వర్షం కారణంగా తడుస్తూ ఇబ్బందులెదుర్కొన్నారు. - 8లో



వేదోక్తంగా సహస్ర కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేదోక్తంగా సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం తిరుప్పావడ ఉత్సవాన్ని చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

3న స్థానికులకు శ్రీవారి దర్శనం

తిరుమల: తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల భక్తులతోపాటు తిరుమలకు చెందిన స్థానికులకు డిసెంబర్ 3న శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. ఈ మేరకు ఈనెల 1న తిరుపతి మహతి ఆడిటోరియంలో, తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేయనున్నారు. గత నెల 18న ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయించిన విషయం తెల్సిందే. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. స్థానికులు తమ ఆధార్ ఒరిజినల్ కార్డును చూపించి టోకెన్లు పొందవచ్చని టీటీడీ తెలిపింది.

టాస్క్ ఫోర్సు డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ ఎల్.సుబ్బరాయుడితో టాస్క్‌ఫోర్సు డీఎస్పీ ఎండీ.షరీఫ్

తిరుపతి కల్చరల్: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) డీఎస్పీ ఎండీ.షరీఫ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయన టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఆయన ఇది వరకు కడప టౌన్ డీఎస్పీగా పనిచేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికడుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

91.87 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 91.87 శాతం మేర పూర్తి చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. ఆది, సోమవారాల్లో అందరికీ వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో 2,64,636 మందికిగాను 2,43,491 మందికి ఇచ్చామని, ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొనఅనరు. తిరుపతిలో అధికంగా 95.87శాతం, చిన్నగొట్టిగల్లులో 95.61శాతం, ఎర్రావారిపాళెంలో 95.35శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఇడిముక్కల హాసిని

తిరుపతి తుడా: హైదరాబాద్ నగరానికి చెందిన ఇడిముక్కల హాసిని స్విమ్స్ ఆస్పత్రికి రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. డీడీని శనివారం స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్‌కు అందజేశారు. ఆమె మాట్లాడుతూ తమ తాత ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం స్విమ్స్‌కు విరాళం ఇచ్చినట్టు తెలిపారు. దాత హాసిని, కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, స్రవంతి, రాజేష్ బాబుకు డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (బిల్లింగ్ సెక్షన్) సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యపుసింహాసనాన.. మురిపాల తల్లి



సింహ వాహనంపై యోగనరసింహుడి అవతారంలో అమ్మవారు(ఇన్‌సెట్) ముత్యపు పందిరిపై ఆదిలక్ష్మి అలంకరణలో శ్రీపద్మావతీ అమ్మవారు



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజైన శనివారం రాత్రి అమ్మవారు సింహ వాహనంపై యోగ నరసింహుడి అవతారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం ముత్యపు పందిరి వాహనంపై ఆదిలక్ష్మి అలంకారంలో అమ్మవారు అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. - చంద్రగిరి

పులకించినది



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణముఖి నదీ హారతి కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించారు. గంగాదేవి(స్వర్ణముఖి)కి ఆలయ అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించి స్వర్ణముఖి నదిలో ఏరాటు చేసిన ప్రాంతానికి తీసుకొచ్చారు. అక్కడ గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. నదీ హారతులు సమర్పించారు. తర్వాత భక్తులు స్వర్ణముఖి నదిలో దీపాలు వదిలారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి



గంగాదేవికి ప్రత్యేక పూజలు(ఇన్‌సెట్) స్వర్ణముఖి నదికి హారతులు పడుతున్న అర్చకులు

వణికించిన ఫెంగల్!

ఫెంగల్ తుపాన్ ప్రాభవంతో జిల్లా ప్రజలు వణికిపోయారు. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షంతో ఇంటికే పరిమితమయ్యారు. ముసురుతోపాటు ఈదురుగాలులు తోడవడంతో చలికి తట్టుకోలేకపోయారు. ఇదిలా వుండగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముందస్తుగా నాటిన వరి నాట్లు నీటమునిగాయి. రిజర్వాయర్లు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



కలవకూరు చెక్‌డ్యామ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

అప్రమత్తంగా ఉండాలి



ఫెంగల్ తుపాన్ ప్రభావంతో ఈదురు గాలులు ఎక్కువగా ఉన్నాయి. చలి తీవ్రత అధికంగా ఉంది. అవసరమైతే తప్ప బయటకు రావొద్దు. పలు కాజ్‌వేలపై వర్షపునీరు ప్రవహిస్తోంది. చెరువులు, వాగులు, వంకలను ఇరిగేషన్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలి. రెండు రోజుల పాటు అధికారులు సెలవులు రద్దు చేస్తున్నాం. ఆదివారం సైతం అధికారులందరూ అందుబాటులో ఉండాలి. తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. చిన్నపాటి ఇబ్బంది ఉన్నా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.

– ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా కలెక్టర్

కంట్రోల్ రూమ్స్

కలెక్టరేట్	0877–2236007
గూడూరు	8624252807
సూళ్లూరుపేట	8623295345
తిరుపతి	7032157040
శ్రీకాళహస్తి	8555003504

రోజంతా ఎడతెరిపిలేని వాన

- ఈదురు గాలులు
- తుపాను ప్రభావంతో పెరిగిన చలి తీవ్రత
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- జిల్లా వ్యాప్తంగా 19.6 మి.మీ వర్షం
- అప్రమత్తమైన యంత్రాంగం



సత్యవేడు: చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



నారాయణవనం: కాజ్‌వే వద్ద పోలీసు పహారా

తిరుపతి అర్బన్: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షాలు కురిశాయి. రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో నీళ్లు చేరాయి. పలు విమానాలను బెంగళూరు వైపు దారిమళ్లించారు. తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరు, వెంకటగిరి మున్సిపాలిటీల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సముద్రతీర మండలాలైన చిల్లకూరు, చిట్టమూరు, తడ, సూళ్లరుపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. లక్ష ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తే...మరో లక్ష ఎకరాల్లో ఇతర వ్యవసాయ, వాణిజ్య పంటలు సాగులో ఉన్నాయి. 20వేల ఎకరాల్లో వరి పంటలు సాగుచేయాల్సి ఉంది. ఈ వర్షాలతో నారుమడులు ముంపునకు గురయ్యాయి. తాజాగా నాటిన వరి నాట్లు మునిగిపోయాయి. కూరగాయల పంటలు కొంత మేర దెబ్బతిన్నాయి. వర్షం కన్నా ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉండడంతో జనం ఇంటికే పరిమితమయ్యారు.

అలముకున్న చీకట్లు

వర్షంతోపాటు ఈదురుగాలుల ప్రభావం ఎక్కువగా ఉండడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరదయ్యపాళెం, రేణిగుంట మండలాలతోపాటు సముద్రతీర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కాజ్‌వేలపైకి వర్షపు నీరు రావడంతో పలు చోట్ల వాహన రాకపోకలు స్తంభించాయి.

పిచ్చాటూరులో అత్యధిక వర్షం



వరదయ్యపాళెం : గోవర్ధనపురం వాగులో ఇరుక్కున బస్సు

జిల్లాలో శనివారం సాయంత్రం 6 గంటల వరకు సగటున 19.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పిచ్చాటూరులో 30.4 మి.మీ, అత్యల్పంగా పాకాలలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే సూళ్లూరుపేటలో 28.2, తడలో 27.43, వాకాడులో 20.2, వరదయ్యపాళెంలో 19.5, చిట్టమూరులో 19.4, దొరవారిసత్రం 18.9, సత్యవేడు 18.7, నారాయణవనంలో 18.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

నిండుతున్న చెరువులు



నిండిన మల్లిమడుగు రిజర్వాయర్

జిల్లాలో 595 చెరువులు ఉన్నాయి. ఇప్పటి వరకు 10 శాతం చెరువులు మాత్రమే నిండాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే మిగిలిన చెరువులు నిండుతాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 80వేల ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. మరో 20వేల ఎకరాల్లో సాగుచేయాల్సి ఉంది. వర్షాల ప్రభావం మరింత ఎక్కువైతే నాటిన వరి మడులు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రిజర్వాయర్లు కళకళ

- రేణిగుంట మండలంలోని మల్లెమడుగు రిజర్వాయర్ 0.181 టీఎంసీల సామర్థ్యం కాగా.. ఇప్పటికే పూర్తిగా నిండింది. రెండు గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మల్లెమడుగులో 0.176 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు.
- కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ 0.240 టీఎంసీల సామర్థ్యం కాగా.. ప్రస్తుతం 0.133 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2,800 క్యూసెక్కులు ఉంది. అవుట్‌ఫ్లో 3,400 క్యూసెక్కులకు చేరింది. ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
- వాకాడు వద్ద స్వర్ణముఖి బ్యారేజ్ సామర్థ్యం 0.035 టీఎంసీలుండగా.. ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది.
- పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు 1.85 టీఎంసీల సామర్థ్యం కాగా.. ఇప్పటికే 80 శాతం వరకు నిండింది. ఇన్‌ఫ్లో 2,900 క్యూసెక్కులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. మరో 24 గంటల్లో అరణియార్ ప్రాజెక్టు పూర్తిగా నిండే అవకాశం ఉంది.



చిల్లకూరు : నీటమునిగిన వరి నాట్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దపాండూరు చెరువు

ఏడు రోజులుగా పస్తులు

వాకాడు/ చిల్లకూరు: ఫెంగల్ తుపాను కారణంగా ఏడు రోజులు ముందు నుంచే సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తీర ప్రాంత మత్స్యకారులకు వారం రోజులుగా ఎలాంటి పనీ లేక పస్తులతో కాలం నెట్టుకురావాల్సి వస్తోంది. గత రెండు రోజులుగా ముసురు పట్టుకోవడం.. అలల ఉధృతి అధికంగా ఉండడంతో మత్స్యకారులు పడవలు, వలలు ఒడ్డున భద్రం చేసుకుని ఇంటికే పరిమితమయ్యారు. తూపిలిపాళెం వద్ద సముద్రంలో అలలు ఏడు మీటర్ల ఎత్తు వరకు ఎగసి పడుతున్నాయి. సముద్రం దాదాపు 15 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రం మీదుగా వచ్చే చలుగాలులతో చిల్లకూరు మండల ప్రజలు వణికిపోయారు.



ఒడ్డుకు చేరిన బోట్లు

అరణియార్ గేట్ల పరిశీలన



అరణియార్ అధికారులతో మాట్లాడుతున్న తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు

నాగలాపురం: పిచ్చాటూరు అరణియార్ రిజర్వాయర్ గేట్లను ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. అరణియార్ నీటిమట్టం 27 అడుగులకు చేరిన వెంటనే గేట్లను ఎత్తుతామని ఏఈ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ వెంట పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేష్, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ ఉన్నారు.

కాళంగికి భారీ వరద

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌కు ఫెంగల్ తుపాను కారణంగా పెద్దఎత్తున వరదనీరు చేరింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొదటగా 8 గేట్లు ఎత్తి 6,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు సత్యవేడు ఇరిగేషన్‌శాఖ సబ్‌డివిజన్ డీఈ రత్నాకర్‌రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 200 ఎంసీఎఫ్‌డీ (0.240 టీఎంసీ)లు కాగా, శనివారం సాయంత్రానికి 164 ఎంసీఎఫ్‌డీల నీరు రిజర్వాయర్‌కు చేరిందన్నారు. దీంతో 8 గేట్లు ఎత్తి నీటిని బయటకు తరలించినట్లు డీఈ వివరించారు.



అరణియార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిబ్బంది

కార్తీకం..పరిపూర్ణం



స్వర్ణముఖి నదిలో కలిపేందుకు తీసుకొచ్చిన నిర్మాలయములు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిలో శనివారం కోటి బిల్వార్చన- కోటి కుంకుమార్చన, లక్ష బిల్వార్చన-లక్ష కుంకుమార్చన నిర్మాలయములను కలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ పూజలను నిర్వహించారు. శనివారం కార్తీక మాసం ముగియడంతో ఆలయంలో పలు రకాల పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వాటిని నదిలో కలిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి



పూజా సామగ్రిని నదిలో పోస్తూ..

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,147 మంది స్వామివారిని దర్శించుకోగా 23,096 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఏరోజుకారోజు శుభ్రం చేస్తాం

తిరుపతి అర్బన్: రైల్వే ఏసీ కోచ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసే బెడ్‌షీట్లు, పిల్లో కవర్స్, టవల్స్‌ను ఏ రోజుకు ఆ రోజే శుభ్రం చేసి అందిస్తామని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. రైల్వే కోచ్‌లో తిరుపతి నుంచి అందిస్తున్న బెడ్ షీట్లతోపాటు పిల్లో కవర్స్, టవల్స్ శుభ్రంగా లేవని, వారం రోజులకు ఒకసారి మార్పు చేస్తున్నారంటూ కొందరు ప్రయాణికులు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సూచనల మేరకు పలువురు అధికారులు తిరుపతిలోని చింతలచేనులో రైల్వేకి చెందిన మెకనైజ్డ్ ల్యాండ్రీని శనివారం పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. ఇదే అంశాన్ని సీనియర్ కోచింగ్ డిపో అధికారి ప్రణయ్ కుమార్ సైతం మీడియాకు వివరించారు.



చింతలచేనులో బెడ్ షీట్లు శుభ్రం చేస్తున్న సిబ్బంది



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.78,880
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.91,800
రిటైల్ వెండి గ్రాము	రూ.94.80

క్లుప్తంగా

పంట పొలాలపై గజరాజుల బీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమాట తోట

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంట పొలాలను తొక్కి నాశనం చేస్తున్నాయి. వారం రోజులుగా చిట్టిచెర్ల, దీన్‌దార్లపల్లె పంచాయతీల పరిధిలోని అటవీ సరిహద్దు పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. టమాట, మామిడి, అరటి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. శుక్రవారం రాత్రి 16 ఏనుగులు ఘీంకారాలు చేస్తూ పంట పొలాలను తొక్కి నాశనం చేసినట్టు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు రాకుండా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సూళ్లూరుపేటలో రెండు చోట్ల చోరీలు



చోరీ జరిగిన బాలత్రిపుర సుందరీదేవి ఆలయం

సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల భారీచోరీలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రాత్రి దొంగలు ఓ ఇంట్లో, ఆలయంలో ఉన్న అమ్మవారి నగలను అపహరించుకెళ్లారు. వివరాలు.. పట్టణంలోని ఇసుక మిట్ట ప్రాంతంలో ఉన్న బాలత్రిపుర సుందరీ దేవి ఆలయంలో గుర్తుతెలియన దొంగలు చొరబడ్డారు. ఆలయ తలుపులు పగులగొట్టి అమ్మవారి వడ్డాణం, రెండు కళ్లు, కనురెప్పలు, బొట్టు, ముక్కు పుడక సుమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అలాగే హుండీలోని సుమారు రూ.20వేల నగదు చోరీ చేశారు. అలాగే సూళ్లూరు ప్రాంతంలోని డీలర్ రమేష్ ఇంట్లో చొరబడి రూ.2 లక్షల నగదు, మూడు సరవర్ల బంగారు నగలను అపహరించుకెళ్లారు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. ఈ విషయంపై ఎస్ఐ బ్రహ్మానాయుడును వివరణ కోరగా ఆలయంలో 45 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్టు గుర్తించామన్నారు. డీల్లర్ రమేష్ ఇంట్లో చోరీ విషయమై విచారిస్తున్నామని తెలిపారు.

వర్షం..రోగులకు నరకం



రుయా ఎమర్జెన్సీ భవనం ముందు పడిగాపులు కాస్తున్న రోగులు, సహాయకులు

ఫెంగల్ తుపాను నేపథ్యంలో తిరుపతిలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. తిరుపతి రుయా ఆస్పత్రికి వచ్చి రోగులు వర్షంలో తడుస్తూ నానా ఇక్కట్లు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. వివిధ పరీక్షలు, వైద్యం కోసం ఒక వార్డు నుంచి మరో వార్డులోకి తరలించే క్రమంలో రోగులను వర్షంలోనే తడిపించుకుంటూ తీసుకెళ్లాల్సి వచ్చింది. మరోవైపు సిబ్బంది సైతం రోగులకు సరఫరా చేసే మందులను సైతం వర్షంలోనే తీసుకెళ్లడం కనిపించింది. ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులు వేచి ఉండేందుకు ఎలాంటి సదుపాయం లేకపోవడంతో అత్యవసర చికిత్స విభాగం భవనం ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి దాపురించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





రుయా ఆస్పత్రిలో వివిధ పరీక్షలు, వైద్యం కోసం జోరు వానలోనే రోగులను తీసుకెళ్తున్న సహాయకులు



వర్షంలోనే తడుస్తూ మందులను తీసుకెళ్తున్న సిబ్బంది

38,729 మందికి అందని పింఛన్లు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టినా 38,729 మందికి నగదు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక పింఛను లబ్ధిదారులకు అన్యాయం చేస్తోంది. కొత్త పింఛన్లు ఇవ్వక పోగా.. ఉన్న వాటిని తొలగిస్తోంది. వైఎస్సార్ సీపీ సర్కారు పాలనలో వలంటీర్లు ఒకటో తేదీ వేకువజామునే లబ్ధిదారుల తలుపు తట్టి పింఛను మొత్తాలను ఇచ్చేవారు. అనారోగ్యంతో బాధపడుతూ దూర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం అక్కడికి వెళ్లి అందజేసేవారు. ప్రస్తుతం కూటమి సర్కారు తూతూమంత్రంగా పింఛన్ల పంపిణీని కొనసాగిస్తోంది. ముందస్తుగా పింఛన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునేందుకు ప్రాధాన్యతనిస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీలో 38,729 మంది నగదు పొందలేకపోయారు. చిత్తూరు జిల్లాలో 17,120 మంది, తిరుపతి జిల్లాలో 21,609 మందికి నగదు ఇవ్వలేదు. చిత్తూరు జిల్లాలో 2,66,703 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 2,49,583 మందికి, తిరుపతి జిల్లాలో 2,64,636 మందికి గాను 2,43,027 మందికి మాత్రం నగదు పంపిణీ చేశారు. మిగిలిన 38,729 మందికి పింఛన్ల పంపిణీ చేయడంలో కూటమి సర్కారు విఫలమైంది.

క్యాంటీన్‌కు మోక్షమెప్పుడో?

- కలెక్టరేట్‌లో ఐదు నెలలుగా మూతపడిన క్యాంటీన్
- కాఫీ, టీ, భోజనానికి ఇక్కట్లు
- గ్రీవెన్స్ రోజు మరిన్ని కష్టాలు
- పట్టించుకోని అధికారులు



మూతపడిన కలెక్టరేట్ క్యాంటీన్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లోని క్యాంటీన్ ఐదు నెలలుగా మూతపడింది. దీంతో ఉద్యోగులతోపాటు కలెక్టరేట్‌కు వచ్చిపోతున్న అర్జీదారులు ఇక్కట్లు పడుతున్నారు. కలెక్టరేట్ కార్యాలయం తిరుపతి నగరానికి దూరంగా ఉంది. ఈ క్రమంలో సమీపంలో క్యాంటిన్ సౌకర్యం లేదు. దీంతో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 2022 ఏప్రిల్ కలెక్టరేట్ కార్యాలయం ఏర్పాటు చేసిన నాటి నుంచే క్యాంటీన్ నడుస్తోంది. భోజనంతోపాటు కాఫీ,టీ, మజ్జిగ, బజ్జీలు, బొండాలు తదితర అన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో 20కి పైగా విభాగాలున్నాయి. 250 మందికి పైగానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. వివిధ సమస్యలపై రోజు వందల సంఖ్యలో జిల్లా వాసులు వచ్చిపోతుంటారు. సోమవారం అయితే గ్రీవెన్స్ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి వెయ్యి మందికి పైగానే వచ్చిపోతుంటారు. సమీపంలో ఎక్కడా క్యాంటీన్ వసతి లేదు. దీంతో భోజనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కలెక్టరేట్ కార్యాలయంలో కింది భాగంలో పలు గదుల తోపాటు రెండు విశాలమైన హాళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందరికీ సౌకర్యంగా ఉండడం కోసం 2022 ఏప్రిల్ నుంచి కలెక్టరేట్‌లో క్యాంటీన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓ హాల్‌ను అద్దెకు ఇచ్చారు. తక్కువ ధరలకు భోజనంతోపాటు అన్నింటిని అందుబాటులో ఉంచారు. అందరికీ సౌకర్యంగా ఉండేది. అయితే రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడడంతో క్యాంటిన్ నిర్వహిస్తున్న వ్యక్తి వైఎస్సార్‌సీపీకి చెందిన నేతగా భావించి, ఆయన్ని ఖాళీ చేయించారని చర్చసాగుతోంది. అయితే టీడీపీకి చెందిన వ్యక్తులకు అయినా క్యాంటీన్ ఇస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని ఉద్యోగులతో పాటు కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు అంటున్నారు. అధికారులు ఐదు నెలలుగా క్యాంటీన్‌ను ఎవరికీ కేటాయించకుండా అలానే ఖాళీగా ఉంచేశారు. దీంతో పలువురు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా కలెక్టరేట్ అధికారులు స్పందించి క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.50 లక్షల విరాళం



టీటీడీ ఈఓకు చెక్కు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి చంద్రశేఖర్

తిరుపతి తుడా : ముంబయికి చెందిన జీస్ అండ్ బోమని ఎ దుబాష్ చారిటీ ట్రస్టు టీటీడీలోని శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్ (స్విమ్స్)కి రూ.50 లక్షలు విరాళం గా అందజేసింది. ఈ మేరకు ట్రస్టు ప్రతినిధి చంద్రశేఖర్ చెక్కును శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో జె.శ్యామలరావుకు అందజేశారు. గతంలో కూడా ఈ ట్రస్టు వివిధ సందర్భాల్లో స్విమ్స్‌కు రూ.ఏడు కోట్లు విరాళమిచ్చింది.

ఆర్టిఫీషియల్ దర్శనం సాధ్యం కాదు

తిరుపతి సిటీ: తిరుమలలో ప్రస్తుతం సామాన్య ప్రజలకు, భక్తులకు జరుగుతున్న దర్శనం అపచారమేనని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ఓవీ రమణ విమర్శించారు. శనివారం తిరుపతిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిని మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహా లఘు దర్శనం తీసివేసి ఆ స్థానంలో సామాన్య ప్రజలకు లఘు దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీతో శ్రీవారి దర్శనం సాధ్యం కాదని, ఆ ప్రయత్నం వృథా అని అభిప్రాయపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో కల్తీ నెయ్యి వివాదంలో సీబీఐ లోతుగా విచారించి వాస్తవాలు బయటకు తీయాలన్నారు.

వేదోక్తంగా సహస్ర కలశాభిషేకం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం వేదోక్తంగా సహస్ర కలశాభిషేకం జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు మొదటి కాలాభిషేకం, 6.30కు మొదటి కాల నైవేద్యం, 7.30 గంటలకు రెండవ కాలాభిషేకం, 8గంటలకు రెండవ కాల నైవేద్యం 11 నుంచి 12గంటల వరకు మూడవ కాల సహస్ర శంఖాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు తిరుప్పావడ ఉత్సవం జరిగింది. ఈ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ. బాపిరెడ్డి దంపతులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

6న ఆకేపాటి తిరుమల మహా పాదయాత్ర



పాదయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శంకరయ్య, పద్మనాభరెడ్డి

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఈనెల 6వ తేదీన రాజంపేట నుంచి తిరుమలకు మహా పాదయాత్ర చేపట్టనున్నట్టు ఆయన వ్యక్తిగత కార్యదర్శి శంకరయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మహా పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రతి ఏటా గోవింద మాల ధరించి వేలాది మంది భక్తులతో రాజంపేట మండలం, నవోదయ కాలనీలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుమలకు మహా పాదయాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా 22వ మహా పాదయాత్ర ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రాజంపేటలో ఆరంభమవుతుందన్నారు. 9వ తేదీన ఉదయం 6 గంటలకు అన్నమయ్య కాలిబాట ద్వారా పాదయాత్రగా తిరుమలకు చేరుకుంటారన్నారు. సమావేశంలో ఆయనతో పాటు అనంత పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

అతి తక్కువ ధరకే ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలు

- ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్‌వర్క్ చైర్మన్ జీవీ రెడ్డి



మాట్లాడుతున్న జీవీ రెడ్డి

రేణిగుంట : ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా అతి తక్కువ ధరకే పేద, మధ్య తరగతి ప్రజలకు ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్, ల్యాండ్ ఫోన్లను ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఫైబర్ నెట్‌వర్క్ చైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు. 2019లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.199లతో 10 లక్షల ఇంటర్నెట్, ల్యాండ్ ఫోన్, కేబుల్ కనెక్షన్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఏపీ ఫైబర్ నెట్ ద్వారా రానున్న రోజుల్లో 50 లక్షల కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ల కంటే ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా నాణ్యమైన సేవలు అందజేస్తామన్నారు. సమస్యలు తలెత్తితే త్వరితగతిన పరిష్కరించేలా సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

ప్లేస్‌మెంట్‌లో సత్తా చాటిన ఎంబీయూ



ఎంపికైన విద్యార్థులతో వీసీ వోస్ట్ నాగరాజ రామారావు, వీసీ కరుణాకరన్

చంద్రగిరి: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) విద్యార్థులు సత్తా చాటారు. శనివారం ఎంబీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్, చెన్నైకి చెందిన ప్రముఖ కంపెనీ ఏజెన్సీలు, హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 48 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించారు. ఈ సందర్భంగా వీసీ వోస్ట్ నాగరాజ రామారావు, వీసీ కరుణాకరన్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున, రిజిస్ట్రార్ సారథి, ఫైనాన్స్ డైరెక్టర్ రవిశేఖర్ పాల్గొన్నారు.